మందుల పిచికారీ.. జాగ్రత్తలు తప్పనిసరి

- నాణ్యమైన మందుల ఎంపికే ప్రధానం
- పురుగు మందులను ఇళ్లలో నిల్వ ఉంచితే ప్రాణాపాయం
- మండల వ్యవసాయ అధికారిణి భారతి



పూర్తి రక్షణ లేకుండా మందు పిచికారీ చేస్తున్న రైతు



భారతి, ఏఓ నల్లచెరువు మండలం

నల్లచెరువు: ఖరీఫ్ సీజన్‌లో రైతులు వ్యవసాయ పనుల్లో బీజీ బిజీ అయ్యారు. పంటల్లో చీడపీడల నియంత్రణ కోసం ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేస్తుంటారు. అయితే ఇలాంటి సమయంలో రైతులు జాగ్రత్తలు పాటిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని మండల వ్యవసాయ అధికారిణి భారతి చెబుతున్నారు. రైతులకు నకిలీ పురుగుల మందుల బెడద ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. ఎరువులు కొనుగోలు, రసాయన పురుగుల మందులు వాడకంపై రైతులకు పలు సలహాలు ఇచ్చారు. వివరాలు ఆమె మాటల్లోనే..

పురుగుల మందుల కొనుగోలు

ప్రస్తుతం ఖరీఫ్ రైతులు వేరుశనగ, వరి, మొక్కజొన్న, టమాట, వంగ, బీర వంటి పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. పంటలకు ఆశించే తెగుళ్ల నియంత్రణకు రైతులు కొనుగోలు చేసే రసాయన పురుగుల మందుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన ఎరువుల దుకాణాల్లో మాత్రమే రైతులు పురుగు మందులు కొనుగోలు చేయాలి. మందుల డబ్బాలపై వజ్రాకారంలో పురుగుల మందుల స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరిత మందులైతే నీలిరంగు, తక్కువ విషపూరితమైతే ఆకుపచ్చరంగు గుర్తులుంటాయి. వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన మందులను మాత్రమే రైతులు వినియోగించాలి. పంటకు చీడ పీడల సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి వారి సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలి. రసాయన ఎరువులు, మందులు రైతులు అవసరానికి మించి కొనుగోలు చేయకూడదని ముందస్తుగా పురుగుల మందులు కొని నిల్వ చేయొద్దని అధికారులు సూచిస్తున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

రైతులు పురుగుల మందులు నిల్వ ఉంచినప్పుడు, పిచికారీ చేసేటప్పుడు అజాగ్రత్తగా ఉంటే ప్రమాదం తప్పదు. ఆహార పదార్థాలతో పాటు పంటలకు పిచికారీ చేసే పురుగు మందులను సరఫరా చేయకూడదు. ఇంట్లో మందులు నిల్వ ఉంచినప్పుడు తాళం వేసి చిన్న పిల్లలకు అందకుండా జాగ్రత్త పడాలి. అసలైన ప్యాకింగ్‌తో ఉన్న కీటక నాశిని ఎరువులను కొనుగోలు చేయాలి. ప్యాకింగ్ ఓపెన్ చేసి మందులను ఉపయోగించే ముందు ప్యాకెట్‌లోని టేబుల్ వివరాల పత్రాన్ని చదవాలి. మందులు పిచికారీ చేసేటప్పుడు తలకు రక్షణగా హెల్మెట్, శరీరానికి పూరి రక్షణగా ఉండే దుస్తులను, మాస్కును ధరించాలి. సూచించిన పరిమాణంలో బకెట్లో మందును కలిపి కర్రతో బాగా కలియబెట్టాలి. మందుల డబ్బాల్లో ఆహార పదార్థాలు తాగునీరు వంటివి నిల్వ చేసేందుకు ఉపయోగించరాదు.గాలి వీచే దిశలో పిచికారీ చేస్తూ నడవాలి. పిచికారీచేసేటప్పుటు ఆ వ్యక్తి ఆహార పదార్థాలను తినకూడదు. పొగ తాగరాదు. నాజిల్ శుభ్రపరిచేందుకు నోటితో ఊదకూడదు. చిల్లు పడిన, పాడైపోయిన స్ప్రేయర్లు వాడొద్దు. ప్రమాదవశాత్తూ శరీరంపైగానీ దుస్తులపైగానీ మందు పడితే వెంటనే శుభ్రంచేసుకోవాలి, పిల్లలచేత పిచికారీ చేయించరాదు. ఉదయం, సాయంత్రం పూటనే పిచికారీ చేయాలి. తినేముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. ప్రమాదవశాత్తూ విష ప్రభావం కలిగితే వెంటనే ప్రాథమిక చికిత్స చేసే డాక్టర్ వద్దకు మందుల డబ్బా వివరాల పత్రాన్ని చూపించి వైద్యం చేయించుకోవాలి. వాడేసిన ఖాళీ డబ్బాలను భూమిలో పాతి పెట్టాలి. మందు పిచికారీ పూర్తయిన వెంటనే స్నానం చేసి దుస్తులను శుభ్రపరుచుకోవాలి.

క్లుప్తంగా

కదిరి తహసీల్దార్‌గా మురళీకృష్ణ



కదిరి టౌన్: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం నూతన తహసీల్దార్‌గా మురళీకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఈయన కుప్పం నియోజకవర్గం శాంతిపురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా ఆయనకు రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని నూతన తహసీల్దార్ పేర్కొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప

ధర్మవరం అర్బన్: లోనికోట ఉర్దూ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 95 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. వారిలో నలుగురు విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. ప్రతి విద్యార్థి కంటి చూపు పట్ల అశ్రద్ధ వహించరాదని ప్రభుత్వ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వహీద, ఏఎస్ఎం వరలక్ష్మి, ఆశా కార్యకర్త లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు



తహసీల్దార్ రంగనాయకులతో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు

నల్లమాడ: నూతన తహసీల్దార్ వై.రంగనాయకులను శుక్రవారం వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు. జెడ్పీటీసీ ఎస్. రామచంద్రారెడ్డి, సర్పంచ్‌లు కుళ్లాయప్ప, బొజ్జేనాయక్, మాజీ సర్పంచ్ ఎస్. రాంమోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నాగరాజునాయుడు, నరసింహమూర్తి, మంగేనాయక్ తహసీల్దార్‌ను కలిసి దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారంలో తవవంతు సహకారం అందిస్తామని వారు తహసీల్దార్‌కు తెలిపారు.

యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

కదిరి టౌన్: పట్టణంలో శుక్రవారం సినీ హీరో మహేష్ బాబు పుట్టిన రోజు వేడుకలను ఆయన అభిమాన సంఘం అధ్యక్షుడు ఎల్ఎస్ అల్లాబకాష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మహేష్ బాబు అభిమానులు 25 మంది రక్తదానం చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్‌తో కేక్ కట్ చేయించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. మహేష్ బాబు అభిమాన సంఘం నాయకులు షాబాజ్, ఖాలీద్, మహేష్, రమేష్, వస్తాద్, అబు, ఇర్ఫాన్, భార్గవ్, షారుక్ తదితరులు పాల్గొన్నారు.

తమలపాకుల అలంకరణలో పెద్దమ్మతల్లి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాలేవీధిలో నున్న పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా అమ్మవారు తమలపాకుల అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు వెంకటేశశర్మ అమ్మవారికి అభిషేకార్చనలు చేసిన అనంతరం 1200 తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



పూజలందుకున్న గంగమ్మతల్లి

బత్తలపల్లి: మండల కేంద్రంలోని చెరువు వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు మంజునాథశర్మ బృందం ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా గంగమ్మతల్లి, పోతలయ్య స్వామి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, రజక అభివృద్ధి కమిటీ, ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



కేజీబీవీ సిబ్బందితో మాట్లాడుతున్న జడ్జి జయలక్ష్మి

కదిరి టౌన్: స్థానిక కస్తూర్బా బాలిక విద్యాలయాన్ని శుక్రవారం సీనియర్ సివిల్ జడ్జి ఏఎస్ జయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కూల్‌లో వంటగది, మరుగుదొడ్ల, తరగతి గదులను పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి జడ్జి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్యానెల్ లాయర్లు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, నరసింహులు, ఎస్ఓ పి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సత్కరిస్తున్న నాయకులు

కొత్తచెరువు: నూతన తహసీల్దార్ నాగరాజును శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలతో సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు గంగాదేవి శంకర్, రెడెప్పరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, రాధ నాగరాజు, నాయకులు పాదయాత్ర వాల్మీకి శంకర్, పెయింటర్ గిరి, వడ్డే వెంకటేష్, ఆనందాచారి, ఎంపీటీసీ రఫీ, ఉపసర్పంచ్ యుగంధర్, మల్లెల నాగరాజు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన



అల్లుగుండు గ్రామంలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ భారతి



వెలిచలమలలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ లోకేశ్వరరెడ్డి

నల్లచెరువు: అల్లుగుండు గ్రామంలో నిర్వహిస్తున్న ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని మండల ఏఓ భారతి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో వేసిన పంటను తప్పని సరిగా ఈ క్రాప్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఓ నవీన్ కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ పంట నమోదుపై రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ సహాయకులకు శుక్రవారం ఏఓ షాదాబ్, ఆర్ఐ శ్రీనివాస్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయాలన్నారు. ఇందులో ఎలాంటి తప్పిదాలకు చోటివ్వకూడదన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ బాస్కర్, రెవెన్యూ, వ్యవసాయ సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్పీకుంట: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పకుండా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ లోకేశ్వరరెడ్డి సూచించారు. వెలిచలమల గ్రామానికి చెందిన రైతు ఆర్.రాము వేరుశనగ పొలంలో శుక్రవారం ఎంపికైన 30 మంది రైతులతో ఏఓ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పండించొచ్చన్నారు. రసాయన పురుగుల మందులను అవసరం మేరకే వినియోగించి పండించిన ఉత్పత్తులకు 'ఇండీ గ్యాప్ సర్టిఫికేషన్' ద్వారా ధృవీకరణ చేసి అధిక ధరలకు మార్కెటింగ్ సౌకర్యాన్ని రైతులు పొందాలని సూచించారు. ఈ-క్రాప్ నమోదు చేసుకుంటేనే రైతులకు పథకాలు వర్తిస్తాయని సూచించారు. క్యూఎమ్మెస్ సభ్యులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వీఏఏలు, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని బుక్కపట్నం వ్యవసాయాధికారి సతీష్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం బుక్కపట్నం, కొత్తకోటలో ఈ క్రాప్ బుకింగ్‌పై గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణం 7,886 హెక్టార్లు ఉండగా ఈసారి ఇప్పటివరకూ 4,350 హెక్టార్లలో వివిధ రకాల పంటలను సాగు చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 15 వ తేదీ లోగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోకపోతే ప్రభుత్వం నుంచి పరిహారం అందదన్నారు. సెక్రటరీ శంకర్, వీఆర్ఓ పోతలయ్య, రైతులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని వ్యవసాయానికి అనుసంధానం చేయండి



బహిరంగసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శివనాగప్రసాద్

బత్తలపల్లి: ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని జిల్లా అధికారులను మండల ప్రజా ప్రతినిధులు కోరారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన ఉపాధి హామీ తనిఖీపై ప్రజావేదిక(బహిరంగ సభ) నిర్వహించారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ శివ శంకర్, జిల్లా నిఘా అధికారి సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. 2023–24లో రూ.5.74 కోట్లతో 1,072 పనులు చేపట్టగా వీటిపై గత నెల 29 నుంచి ఈ నెల 8 వరకు సామాజిక తనిఖీ చేపట్టినట్లు బృందం సభ్యులు తెలిపారు. మొత్తం రూ.2,66,512 ప్రభుత్వ ధనం దుర్వినియోగమైనట్లు వెల్లడించారు. దీన్ని బాధ్యుల నుంచి రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. అధికారులు మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది క్షేత్రస్థాయిలో తిరుగుతూ పనులు సక్రమంగా జరిగేలా, కూలీలకు తగిన కూలి పడేలా పనులు కల్పించాలని ఆదేశించారు. సభకు కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఫీల్డ్ అసిస్టెంట్లపై ఫిర్యాదులు చేస్తూ, వారిపైన చర్యలు తీసుకోవాలని అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. అయితే అధికారులు రాతపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వాలని సూచించారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్, అంబుడ్స్‌మెన్ శివారెడ్డి, ఏపీడీలు వెంకటాచలపతి, ఎస్ఆర్‌పీ చంద్రమోహన్, మండల ఇంజనీర్ రమణయ్య, ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, బీజేపీ మండల కన్వీనర్ వీరనారప్ప, సర్పంచులు చల్లా కరుణాకరనాయుడు, ప్రభాకరరెడ్డి, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ నాగార్జున పాల్గొన్నారు.

లేబర్ కోడ్ రద్దు చేయాలని వినూత్న నిరసన



ధర్మవరం నిరసన తెలియజేస్తున్న వామపక్షాల నాయకులు

ధర్మవరం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ బిల్లులను రద్దు చేయాలని సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, ఏఐటీయూసీ, చేనేత కార్మిక సంఘాల నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్ వద్ద శుక్రవారం నాయకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేశారు. కేంద్ర బడ్జెట్‌లో రైతులు, కార్మికులకు నిధులు తగ్గించి కార్పొరేట్లకు అనుకూలంగా ఉండే చట్టాలను తీసుకురావడం అన్యాయమన్నారు. కార్మికులకు సంబంధించిన 44 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌గా తీసుకొచ్చిన బిల్లులను రద్దు చేయాలన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, ఉమ్మడి జిల్లా గ్రామిక మహిళా కన్వీనర్ దిల్షాద్, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్ అయూబ్‌ఖాన్, రైతు సంఘం జిల్లా నాయకులు శేషంపల్లి మారుతి, కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరప్ప, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు మహదేవ్, చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, వెంకటస్వామి, రవి కుమార్, ఏఐటీయూసీ నాయకులు ఎర్రంశెట్టి రమణ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: లేబర్ కోడ్ బిల్లులను రద్దు చేయాలని రైతు, కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ కార్పొరేట్లకు రాయితీలిస్తూ రైతుల వినియోగించే వ్యవసాయ పరికరాలు, ఎరువులు, క్రిమి సంహారిక మందులపై పన్నులు పెంచిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్.నరసింహులు, నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, ముస్తాక్, రఫీ, ఈశ్వర్‌రెడ్డి, నారాయణ, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

తనకల్లు: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరను కల్పించాలని కోరుతూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం , రైతు సంఘం నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బిరెడ్డి మాట్లాడుతూ గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శోభ సువర్ణమ్మకు వినతిపత్రం అందజేశారు. నాయకులు శివన్న, రమణ, వేమన్న, రామాంజులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



పెదకంటివారిపల్లితండా వాసులతో సమస్యలపై ఆరా తీస్తున్న అధికారులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామానాయక్

గాండ్లపెంట: కల్లుబావితండాలో శుక్రవారం ఎంపీడీఓ రామానాయక్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కొమరంభీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గతంలో ఆదివాసీల జీవన విధానం ఎంతో ఇబ్బందిగా ఉండేదన్నారు. మారుతున్న కాలానికనుగుణంగా ప్రభుత్వాలు ఎన్నో సౌకర్యాలు కల్పించి ఆదివాసిల అభ్యున్నతికి కృషి చేశాయన్నారు. ప్రభుత్వాలు కల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఇంకా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈఓఆర్డీ సునీత, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, సర్పంచ్ శాంతమ్మ, ఎంపీటీసీ లక్ష్మీదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: స్థానిక గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ చెన్నకృష్ణ ఆదివాసీ హక్కులు, సంస్కృతీ, వారసత్వాల పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. ఈసందర్భంగా క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంశాపత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీ శ్రీనివాస్, స్కూల్ కమిటీ చైర్మన్ బాబూనాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎన్పీకుంట: తండాలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని హెచ్ఎస్ఎస్ఎస్ డీఈఈ, స్పెషల్ ఆఫీసర్ సురేంద్రరెడ్డి, తహసీల్దార్ నరేంద్రకుమార్ తండావాసులకు హామీ ఇచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పెదకంటివారిపల్లితండాలో అధికారులు పర్యటించి, సమస్యలపై తండావాసులతో ఆరా తీశారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వారు అధికారులను కోరారు. ఈఓఆర్డీ మనోహర్‌బాబు, మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌వర్ధన్, ఎంఈఓ సుబ్బిరెడ్డి, వీఆర్ఓ కిష్టప్ప పాల్గొన్నారు.

భోజనం నాణ్యతగా ఉండాలి



పైలబోయలపల్లిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ-2 ప్రసూన్‌కుమార్

చెన్నేకొత్తపల్లి: విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని మండల విద్యాశాఖ అధికారి-2 ప్రసూన్‌కుమార్ నాయుడు ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని పైలబోయలపల్లి గ్రామంలోని పాఠశాలను సందర్శించారు. తొలుత విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య? ఎంతమంది హాజరయ్యారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. భోజనం రుచిగా ఉందా లేదా ప్రతిరోజు ఎలా ఉంటుంది? కోడిగుడ్లను ఇస్తున్నారా అని విద్యార్థులను ఆరా తీశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భక్తి శ్రద్ధలతో కుబేర మహాలక్ష్మీ వ్రతం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో నున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం మహిళలు కుబేర మహాలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకుముందు వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను అర్చకులు రాజేష్ వివిధ రకాల పూలు, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు చెన్నంశెట్టి జగదీష్, జింకా రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.

12 నుంచి శిక్షణ తరగతులు

అమడగూరు: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై ఈ నెల 12 నుంచి 14 వ తేదీ వరకూ మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు శుక్రవారం ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఓడీచెరువు: స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్ ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కమల్ రోహిత్ మాట్లాడుతూ మొత్తం 62 మంది గర్భిణుల్లో 34 మందిని హైరిస్క్ వారుగా గుర్తించి అత్యవసర చికిత్స నిమిత్తం సిపారసు చేశామన్నారు. గర్భిణులు, వారి సహాయకులకు కదిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో భోజనవసతి కల్పించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

తనకల్లు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి లోకేశ్వర్ రెడ్డి అన్నారు. బాలసముద్రంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మమత,హెల్త్ అసిస్టెంట్ మోహన్‌రెడ్డి, ఏఎన్ఎం షాఫియా పాల్గొన్నారు.

డీఏఓగా సుబ్బలక్ష్మమ్మ

ధర్మవరం అర్బన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజనల్ పరిపాలన అధికారిణి(డీఏఓ)గా సుబ్బలక్ష్మమ్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డిని కలిసి డివిజన్‌లోని మండలాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఏఓకు ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

లారీ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ప్యాదిండి గ్రామానికి చెందిన ఇద్దరు లారీ ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఓబుశేసు తన ద్విచక్ర వాహనంలో ధర్మవరం వెళుతున్నాడు. ధర్మవరం వైపు నుంచి ఎన్ఎస్ గేట్ వైపునకు వెళుతున్న లారీ ఓబుశేసు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ఆపకుండా వెళ్లిపోయింది. అలాగే ప్యాదిండి గ్రామానికి చెందిన కోనయ్య రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా.. అదే లారీ ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ఘటనలో గాయపడిన వీరిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎన్పీకుంట: మరికొమ్మదిన్నె వద్ద 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి విద్యుత్‌లైన్ లాగే పనిలో భాగంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఆగిపోనుంది.

దేశభక్తి ఉట్టిపడేలా పరేడ్



పరేడ్ సాధన చేస్తున్న ఏఆర్ పోలీసులు

పుట్టపర్తి టౌన్: స్వాంతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ సమైకృత, దేశభక్తి ఉట్టిపడేలా పరేడ్ నిర్వహించాలని ఏఆర్ డీఎస్పీ విజయకుమార్ సిబ్బందికి పిలుపునిచ్చారు. స్థానిక పరేడ్ మైదానంలో జరుగుతున్న సాధనను డీఎస్పీ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15న పరేడ్ మైదానంలో స్వాంతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా పరేడ్ నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐలు వలి, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు



కదిరిలో నాగులకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

బత్తలపల్లి: మండలవ్యాప్తంగా శుక్రవారం నాగుల చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కోడేకండ్ల, ముష్టూరు, సంజీవపురం , అనంతసాగరం, ఎం.చెర్లోపల్లి, డి.చెర్లోపల్లి, పత్యాపురం, ఉప్పర్లపల్లి, దంపెట్ల, నెత్తివారంపల్లి, వేల్పుమడుగు, లింగారెడ్డిపల్లి, చెన్నరాయపట్నం, విశ్వనాథపురం, బత్తలపల్లి, పోట్లమర్రి తదితర గ్రామాల్లో పుట్టలకు పూజలు చేసి వాటిలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. నాగప్రతిమల చుట్టూ 9, 11, 41 చుట్లు ప్రకారం మొక్కుల ఆధారంగా దారాన్ని యజ్ఞోపవీతంగా భావిస్తూ నాగమ్మ, నాగప్పలకు సమర్పించారు.

కదిరి టౌన్: శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి, ఆంజనేయస్వామి, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగలచవితి సందర్భంగా మహిళలు సైదాపురం ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న నాగులకు క్షీరాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

మత్తుకు బానిసలైతే జీవితం అంధకారం



మాట్లాడుతున్న సెబ్ ఎస్ఐ శివప్రసాద్

ధర్మవరం అర్బన్: యువత మత్తుకు బానిసలైతే జీవితం అంధకారమవుతుందని సెబ్ ఇన్‌చార్జ్ ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం సెబ్ ఆధ్వర్యంలో యువత-భవిత కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ నేరాలు విద్యార్థి దశలోనే ఎక్కువగా నమోదవుతున్నాయని తెలిపారు. యువత మత్తు వల్ల కలిగే అనర్థాలను తెలుసుకుని జీవితానికి బంగారు బాటలు వేసుకునేలా చదువుకోవాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగిస్తున్నా, అమ్ముతున్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ హర్షవర్ధన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.